సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 7 । నవంబర్ । 2024



'తల్లీబిడ్డ' సేవలు దూరం

ప్రసవం తరువాత తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి చేర్చే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా కుంటుపడే దిశగా నడుస్తున్నాయి. 10లో



అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

ఉంగుటూరు మండలం కైకరం జెడ్పీ హైస్కూల్ గ్రౌండులో అండర్-14 బాలుర, బాలికల విభాగంలో అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. 10లో



ఏలూరు అథ్లెట్లకు పతకాలు

ఏలూరు క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటి పతకాల పంట పండించారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ పోటీలకు అర్హత సాధించారు. 10లో

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణకు 340 రైతు సేవా కేంద్రాలు

భీమవరం: జిల్లాలో సార్వా సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు 340 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేయగా బుధవారం నాటికి 22 రైతు సేవా కేంద్రాల ద్వారా 128 మంది రైతుల నుంచి 11,770 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో కనీస మద్దతు ధర క్వింటాల్ సాధారణ రకం రూ.2,300, గ్రేడ్-ఏ రకం రూ.2,320 చొప్పున ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం విక్రయాలకు సంబంధించి సమస్యలుంటే కంట్రోల్ రూం నెంబరు 81216 76653కు ఫోన్ చేసి పరిష్కారం పొందవచ్చన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

భీమవరం: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లించడానికి గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 10 వరకు గడువు పొడిగించారని, అపరాధ రుసుం లేకుండా నవంబర్ 18 వరకూ పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.50 అపరాధ రుసుంతో నవంబర్ 19 నుంచి 25 వరకు, రూ.200 అపరాధ రుసుంతో నవంబర్ 26 నుంచి డిసెంబర్ 3 వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 4 నుంచి 10వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు.

ఉచిత ఇసుక సులభంగా పొందేలా చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇసుక సులభంగా పొందేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్‌లో తీపర్రు-2 – 3, ఔరంగాబాద్ ఇసుక రీచ్‌ల నుంచి నేరుగా గాని, ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డు ద్వారా బుక్ చేసుకుని ఉచిత ఇసుకను పొందేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

తాగుడు మూతలు

- నిబంధనల అమల్లో పైన పటారం.. లోన లొటారం
- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు.. ఊరూరా బెల్ట్ షాపులు
- షాపుల వద్ద ప్రత్యేక రూంలు, సిట్టింగ్ ఏర్పాట్లు



తణుకులోని మద్యం దుకాణం వద్ద మందుబాబుల హడావుడి

సాక్షి, భీమవరం: మద్యం పాలసీలో సర్కారు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరుకు పొంతన ఉండటం లేదు. ఎక్సైజ్ సిబ్బంది మామూళ్ల మత్తులో జోగుతుండగా ఊరురా బెల్టు షాపులు తెరుచుకుంటున్నాయి. బార్లను తలపిస్తూ మద్యం షాపుల వద్ద ప్రత్యేక రూంలు, టెంట్లు, టేబుళ్లు తదితర సిట్టింగ్ ఏర్పాట్లతో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో ఏరులై పారిన మద్యం అమ్మకాల కట్టడికి గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేట్ దుకాణాలు తొలగించారు. బెల్టు షాపులు, పర్మిట్ రూమ్‌లు లేకుండా చేశారు. మద్యం షాపుల సంఖ్యను తగ్గించారు. మిగిలిన వాటిని గుడి, బడి, జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్ణీత వేళల్లో మాత్రమే మద్యం విక్రయాలు చేయించారు.

కూటమి తెచ్చిన ప్రైవేట్ పాలసీతో నిన్నటి వరకు ఊరికి దూరంగా ఎక్కడున్నాయో తెలీని మద్యం షాపులు ఇప్పుడు జనావాసాలు, రద్దీ ప్రాంతాల్లోకి వచ్చేశాయి. నివాస ప్రాంతాల్లో షాపుల ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానికులు రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేసినా వ్యాపారులు వెనక్కి తగ్గకుండా షాపులు తెరిచారు. వినియోగదారులకు మద్యం బాటిళ్ల ధరలను తెలియజేస్తూ ధరల పట్టికలు ఏర్పాటుచేయాల్సి ఉన్నా అవి కనిపించడం లేదు. గతంలో షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్లిపోయేవారు. ఇప్పుడు దుకాణాల వద్దనే కూర్చుని తాగేందుకు వీలుగా పలుచోట్ల టేబుళ్లు, కుర్చీలతో పర్మిట్ రూంల మాదిరి సదుపాయాలు కల్పించగా, కొన్ని షాపుల వద్ద టెంట్లు వేసి మరీ సిట్టింగ్ ఏర్పాట్లు చేశారు. మందులోకి మంచింగ్ కోసం ఫాస్ట్‌ఫుడ్ ఐటెమ్స్ అక్కడే అందుబాటులో ఉంచుతూ మినీ బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా సిండికేట్లు మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా మందుబాబులు అక్కడే కూర్చుని మద్యం సేవిస్తూ చేస్తున్న వీరంగంతో వేగలేకపోతున్నామని చుట్టుపక్కల జనం వాపోతున్నారు. గత ప్రభుత్వంలో మద్యం షాపులు ఊరికి దూరంగా ఉండటంతో ఇబ్బంది ఉండేది కాదంటున్నారు.



నరసాపురం తోటల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపు



తాడేపల్లిగూడెం ముత్యాలమ్మవారి ఆలయం రోడ్డులో మద్యం దుకాణం వద్ద సిట్టింగ్ ఏర్పాట్లు

బెల్టు షాపుల జోరు

జిల్లాలో 175 మద్యం దుకాణాలకు ఐదు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీ పరిధిలో 61 షాపులు, 410 పంచాయతీల్లో 114 షాపులు ఏర్పాటుచేశారు. షాపుల్లేని గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాల కోసం ముందుగానే సిండికేట్లు వ్యూహరచన చేశాయి. కొన్ని చోట్ల వేలం పాటలు, మరికొన్ని చోట్ల రూ.50 వేలు నుంచి రూ.1.5 లక్ష వరకు డిపాజిట్లు చెల్లించిన వారికి, కూటమి కార్యకర్తలకు బెల్టులు అప్పగించారు. కిళ్లీ బడ్డీలు, చిన్న చిన్న దుకాణాలు, జంతుబలులిచ్చి భక్తులు ఎక్కువగా మొక్కుబడులు చెల్లించుకునే గ్రామ దేవతల ఆలయాల వద్ద వాటిని తెరిచారు. జిల్లా వ్యాప్తంగా 500కు పైగానే బెల్టుషాపులు ఏర్పాటుచేసినట్టు అంచనా. క్వార్టర్, బీర్ బాటిల్‌కు ఎంఆర్‌పీ ధర్‌పై అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు అమ్మకాలు చేస్తున్నారు. ఇటీవల తణుకు సంత మార్కెట్ వద్ద రోడ్డు పక్కనే మద్యం బాటిల్స్ పెట్టి అమ్మకాలు చేయడం మీడియాలో వైరల్ అయ్యింది. కూటమి పాలనలో విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం అమ్మకాలకు ఇదే నిదర్శనమంటూ ప్రభుత్వంపై పలువురు విమర్శలు గుప్పించారు. ఉన్నత స్థాయి నుంచి వచ్చిన ఆదేశాలతో ఎక్సైజ్ అధికారుల రెండు మూడు రోజులు హడావుడి చేసి అక్కడక్కడ కొన్నింటిని మూయించారు. కాగా చాలాచోట్ల గుట్టుచప్పుడు కాకుండా బెల్టుల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. బెల్టులు ఏర్పాటుచేస్తే రూ.5 లక్షల ఫైన్, రెండో సారి దొరికితే లైసెన్సు రద్దు హెచ్చరికలు షరామామూలేనన్న ధోరణిలో సిండికేట్ వర్గాలున్నాయి.

కూటమి వైఫల్యాలు ఎండగడదాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



గూడెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, చిత్రంలో మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, గూడూరి ఉమాబాల తదితరులు

పెంటపాడు: రాష్ట్రంలో అసమర్థ కూటమి వైఫల్యాలు ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమన్వయంతో ముందుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం తాడేపల్లిగూడెంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ.. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే పనిలో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కమిటీలు వేసే పనిలో పార్టీ ఉందన్నారు. పరాజయం కారణాలను బేరీజు వేసుకొని ఆ తప్పులు మళ్లీ దొర్లకుండా ఉండేలా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కొత్తగా జిల్లా అధ్యక్షులను నియమించారన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి గ్రామ, మండల, పట్టణ స్థాయి సమావేశాలతో పాటు, ప్రతీ నెలకు నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు కచ్చితంగా జరిగేలా పార్టీలో సమన్వయ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కూటమి పాలనలో విసుగు చెందిన ప్రజలు

కూటమి పాలన 5 నెలల కాలంలో ప్రజలు విసుగు చెందారని.. రైతులు, మహిళలు, వ్యాపార, వ్యవసాయ రంగాలు, డ్వాకా రంగాలు కుదేలయ్యాయన్నారు. మద్యం ద్వారా కూటమి నాయకులు బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకున్నారన్నారు. రూ.15 వేల కోట్ల విద్యుత్ భారం మోపేందుకు కూటమి సిద్ధంగా ఉందన్నారు. పవన్ కల్యాణ్ విమర్శలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. ఈ హోంమంత్రిని సాగనంపుతారా? అని ముదునూరి ప్రశ్నించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన నడుస్తుందన్నారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే వారిపై దాడులు చేయిస్తున్నారన్నారు. గూడెంలో తాను మంజూరు చేసిన రహదారులు మినహా ఇంతవరకూ గోతులను పూడ్చించలేదని.. సభ్యత, సంస్కారాన్ని వదిలి ప్రస్తుత ఎమ్మెల్యే ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు వదిలేసి ప్రజలను డైవర్ట్ చేసే పనిలో చంద్రబాబు ఉన్నారన్నారు. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల మాట్లాడుతూ పార్టీలో లోపాలను గుర్తించి, ఓటమికి గల కారణాలను బేరీజు వేసుకొని రాబోయే కాలంలో సమష్టిగా పనిచేసి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసి పార్టీని బతికించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, మహిళా నాయకులు దింటకుర్తి లీలావతి, బోణం విజయనిర్మల, నూనె రాధాకుమారి, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్ కుమార్, వేలిశెటి నరేంద్రకుమార్, కైగాల శ్రీనివాస్, బోణం వీరయ్య, బండారు నాగు, చల్లా లింగమూర్తి, కొలుకులూరి ధర్మరాజు, మానికిరెడ్డి వెంకటేశ్వర్లు, చల్లా లింగమూర్తి, పాలా గణపతి, మొగల్తూరు జెడ్పీటీసీ సభ్యులు రామారావు, చోడగిరి చినబాబు, సలుమూరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహం పాక్షికంగా ధ్వంసం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చిన్న వెల్లమిల్లిలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పాక్షికంగా ధ్వంసమైంది. మంగళవారం రాత్రి కొందరు ఆకతాయిలు అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలును విరగ్గొట్టారు. దీంతో దళిత యువకులు ఆందోళన చేశారు. ఎస్సై సూర్య భగవాన్, డీటీ పోతురాజు, రెవెన్యూ సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. నిందితులను పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో దళితులు ఆందోళన విరమించారు. గ్రామస్తుల సాయంతో విరిగిన వేలును పునరుద్ధరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. మాజీ సర్పంచి మెడంకుల రత్తయ్య మాట్లాడుతూ విగ్రహాన్ని ధ్వంసం చేసిన శిక్షించాలని కోరారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

ద్వారకాతిరుమల: ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న ఇద్దరు యువకులపై మంగళవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని గుణ్ణంపల్లికి చెందిన 14 ఏళ్ల బాలిక నల్లజర్లలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ప్రతి రోజూ పాఠశాలకు ఇంటి వద్ద నుంచే స్కూల్ బస్సులో వెళ్లి వస్తోంది. అయితే పక్క గ్రామమైన తక్కెళ్లపాడుకు చెందిన గంజి ప్రేమ్ కుమార్, మద్దిరాల పోసిబాబు సుమారు 5 నెలల నుంచి ప్రేమ పేరుతో ఆ బాలిక వెంటపడి వేధిస్తున్నారు. ఈ విషయం బాలిక తన తండ్రికి చెప్పగా గ్రామ పెద్దల్లో పెట్టి ప్రేమ్‌కుమార్, పోసిబాబు మందలించారు. అయినప్పటికీ వారు బాలికను వెంటపడి వేధిస్తుండడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెనుగొండ: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టరు పి.శివరామకృష్ణ తెలిపారు. బుధవారం సిద్ధాంతం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఏపీ 05 టీడీ 9921, ఏపీ 39 టీజే 8358 వాహనాల్లో 30 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాహనాల యజమానులు అనిల్‌కుమార్, జి.వీరబాబును ప్రశ్నించగా రేషన్ బియ్యాన్ని కిలో రూ.19కు కొనుగోలు చేసి ఆచంటకు చెందిన జి విశ్వనాథ గుప్త, ఆలమూరుకు చెందిన పి.గంగరాజు ద్వారా రూ.21కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో బియ్యాన్ని, వాహనాలను సీజ్ చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో రెవెన్యూ, పౌర సరఫరా అధికారులు సీఎస్ డీటీ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: మోటార్‌సైకిల్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన చాకలి చిట్టిబాబు (40) మోటారు సైకిల్‌పై కరీంనగర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఏలూరు జాతీయరహదారి దుగ్గిరాల బ్రిడ్జి దాటిన అనంతరం మోటారుసైకిల్ ముందు చక్రం టైరు పంక్చర్ అయింది. దీంతో మోటారు సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సు సిబ్బంది అతడిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షింస్తుండగా మృతి చెందాడని నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తల్లీబిడ్డ సేవలు దూరం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు



మూలకు చేరిన రెండు వాహనాలు

- కుంటుపడే దిశగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవలు
- అరకొర డీజిల్‌తో నెట్టుకొస్తున్న వాహనాలు
- 4 నెలలుగా డ్రైవర్లకు జీతాలు నిల్
- మూలకు చేరుతున్న వాహనాలు
- కూటమి ప్రభుత్వ పనితీరుపై దుమ్మెత్తిపోస్తున్న ప్రజానీకం

తణుకు అర్బన్: ప్రసవం అయిన తరువాత తల్లి, బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడంలో అందరి మన్ననలు అందుకుంటున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు నేడు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా కుంటుపడే దిశగా నడుస్తున్నాయి. సర్కారు దవాఖానాల్లో ప్రసవం అయిన బాలింతలు, శిశువులను ఇంటికి చేర్చే వాహనాలకు చంద్రగండం ఏర్పడే పరిస్థితి దాపురించింది. వాహనాల డ్రైవర్లకు 4 నెలల జీతాల బకాయిలు ఉండగా, వాహనాలు అరకొర డీజిల్‌తో సాగాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్న వాహనాలు సైతం మరమ్మతులు కూడా చేయించలేని స్థితికి చేరాయి. నాలుగు నెలలపాటు జీతాలు అందకపోవడంతో ఇప్పటికే వాహన డ్రైవర్ల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 32 వాహనాలు ఉండగా పశ్చిమ జిల్లాలో 14 వాహనాలు, ఏలూరు జిల్లాలో 18 వాహనాలు సేవలందిస్తున్నాయి. ఈ వాహనాలకు ఒక్కొక్క డ్రైవర్ చొప్పున విధుల్లో ఉన్నారు. ప్రతిరోజూ ఈ వాహనాలు సుమారుగా 200 మందికిపైగా తల్లి, బిడ్డలను సురక్షితంగా వారి ఇంటికి చేరుస్తున్నాయి. అంతటి ప్రాధాన్యత ఉన్న వాహనాలపై ప్రభుత్వం కక్ష కట్టినట్లుగా వ్యవహరిస్తుండడంతో భవిష్యత్తులో వాహన సేవలు నిలిచిపోతాయా అనేట్లుగా ఆందోళన చెందుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

గత ఐదేళ్లు ఘనంగా..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా కొత్త వాహనాలను ఎయిర్ కండిషన్ సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వాసుపత్రుల నుంచి తమ ఇళ్ల ఎంత దూరమైనా వాహనంలోనే వెళ్లేలా మార్గదర్శకాలు తీసుకువచ్చి దూరప్రాంతాలకు సైతం తల్లి,బిడ్డను క్షేమంగా చేర్చేలా కార్యాచరణ చేసి అమలుపరిచారు. దీంతో బాలింతలు, వారి కుటుంబ సభ్యులు ఈ వాహన సేవలను కొనియాడే పరిస్థితికి ఈ సేవలు ఎగబాకాయి. అటువంటి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు నేడు మందగించే పరిస్థితికి కూటమి ప్రభుత్వం దిగజారుస్తుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే కొన్ని వాహనాలు మూలకు చేరే పరిస్థితి ఏర్పడింది. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉండే 6 వాహనాల్లో రెండు మరమ్మతులు చేయించలేక మూలకు చేరగా, ఒక వాహనం మరొక ఆస్పత్రికి పంపించారు. ప్రస్తుతం మూడు వాహనాలు మాత్రమే సేవలందిస్తున్నాయి. ప్రసవాల కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు జిల్లా కేంద్ర ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లకు నిత్యం పదుల సంఖ్యలో గర్భిణులు 108, ప్రైవేటు వాహనాల ద్వారా చేరుతుంటారు. ప్రసవానంతరం బాలింతలను, బిడ్డలను ఎటువంటి నొప్పి తెలియకుండా సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నాయి ఈ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు. ఈ సమస్యపై వాహనాలకు సంబంధించిన జిల్లాస్థాయి అధికారులను 'సాక్షి' వివరణ కోరగా సమస్యల తాలూకా వివరాలను కప్పిపుచ్చుకునే విధంగా మాట్లాడుతుండడం శోచనీయం.

జీతాలు ఇవ్వకపోతే ఎలా..



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లు 4 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. బాలింతలను సురక్షితంగా ఇంటికి చేరుస్తున్న వాహన సేవలపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. తక్షణమే వాహన డ్రైవర్లకు జీతాల బకాయిలు చెల్లించడంతోపాటు వాహనాలన్నీ కండిషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– కోనాల భీమారావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

క్రీడలతో దేహదారుఢ్యం

- నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల విజేతలకు బహుమతి ప్రదానం



చెడుగుడు విజేతలకు ప్రథమ బహుమతి అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

చింతలవల్లి (ముసునూరు): క్రీడలతో దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం, సమయ పాలన, క్రీడా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు అలవడతాయని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు–కొత్తూరులో గత వారం రోజులుగా జరిగిన 59వ రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల విజేతలకు జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ అధ్యక్షతన మంగళవారం రాత్రి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ గ్రామంలో గత 59 ఏళ్లుగా నిర్విఘ్నంగా రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గోగులంపాడు చెడుగుడు కమిటీ కృషిని అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వరుసగా విజయవాడ స్కై టీమ్, ఎన్టీఆర్ జిల్లా వినన్నపేట శ్రీశ్రీ టీమ్‌లు సాధించగా, గోగులంపాడు బాహుబలి టీమ్, చింతలవల్లి ఆరు బుల్లెట్స్ టీమ్ మూడవ, నాలుగో స్థానాల్లో నిలిచాయి. విజేతలకు మాజీ ఎమ్మెల్యే నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పి.సత్యనారాయణ, ఎంపీటీసీ పి.సుధాకర్, సొసైటీ మాజీ అధ్యక్షుడు సుగసాని శ్రీనివాసరావు, మండల, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, శీలం రామయ్యారావు, తొర్లపాటి సాంబశివరావు, పలగాని కోటేశ్వరరావు, తాళ్ల శ్రీనివాసరావు, చాకిరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించాలని వినతి



వినతిపత్రం అందజేసిన ఆగిరిపల్లి మండల ప్యాప్టో నాయకులు

ఆగిరిపల్లి: ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లోనే శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆగిరిపల్లి మండల ప్యాప్టో నాయకులు కోరారు. తోటపల్లి హీల్ పాఠశాలలో శిక్షణ కేంద్రానికి వచ్చిన సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ వి.మస్తానయ్య, జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం.వెంకటలక్ష్మిని బుధవారం ఆగిరిపల్లి మండల ప్యాప్టో నాయకులు కలిశారు. హెచ్‌ఎం రత్నకుమార్ గుండెపోటుతో మరణించారని, ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను వెంటనే నిలుపుదల చేసి, మృతి చెందిన హెచ్‌ఎం కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీనిపై సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ వి.మస్తానయ్య స్పందిస్తూ శిక్షణ తరగతులను తాత్కాలికంగా నిలుపుదల చేసి ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు రత్నకుమార్ కుటుంబానికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అతి త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి ఎస్టీయూ మండల అధ్యక్షుడు మక్కే వేణుగోపాల్, కార్యదర్శి అంకం వెంకటేశ్వరరావు, ఆగిరిపల్లి మండల ప్యాప్టో నాయకులు చౌటపల్లి సురేష్, తాడి ప్రసాద్, కే. అజరయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సూర్యారావుపాలెం ఘటన తీవ్ర విషాదాంతం

గాయపడి చికిత్స పొందుతున్న వారంతా మృతి

తణుకు: ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన భారీ విస్ఫోటనంలో మృతుల సంఖ్య ఏడుకు చేరుకుంది. గత నెల 30న బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన ఘటనలో తణుకు మండలం వెంకట్రాయపురం గ్రామానికి చెందిన వేగిరోతు శ్రీవల్లి, పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత ఘటనా స్థలంలోనే సజీవ దహనం అయిన విషయం తెలిసిందే. కాగా ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో 5గురిని తొలుత తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇరగవరం మండలం కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు చికిత్స పొందుతూ మృతి చెందగా, ఈనెల 5న తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన కడియం కుమారి, పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన శీలం లక్ష్మి, మందలంక కమలరత్నం చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు (45) మృతి చెందారు. దీంతో ఈ ఘోర ప్రమాదంలో గాయపడిన వారంతా మృతి చెందినట్లు అయ్యింది.

కూలి పనులు చేసుకుంటూ...



చుక్కా పెద్దింట్లు (ఫైల్)

తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. నెల రోజుల క్రితమే బాణసంచా తయారీ కేంద్రంలో రోజువారీ కూలీగా చేరారు. పెద్దింట్లుకు కుమార్తె ప్రసన్న ప్రవల్లిక, కుమారుడు సాయికిరణ్ సంతానం. వీరికి వివాహాలయ్యాయి. కాగా కొడుకు, కోడలు మధ్య మనస్పర్థల కారణంగా కోడలు పుట్టింటికి వెళ్లిపోయింది. మరోవైపు పెద్దింట్లు భర్త మసలయ్య సైతం పదేళ్ల క్రితం వదిలేసి వెళ్లిపోవడంతో ఒంటరిగానే జీవిస్తున్నారు. ప్రస్తుతం కొడుకు సాయికిరణ్‌తోపాటు పెద్దింట్లు నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాధఛాయలు అలముకున్నాయి.

ఏలూరు అథ్లెట్లకు పతకాలు



అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు



వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారిణులు

జాతీయ పోటీలకు ఇద్దరు ఎంపిక

ఏలూరు రూరల్: ఏలూరు సాయ్ (ఖేలో ఇండియా స్టేట్ లెవల్ సెంటర్) క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటి పతకాల పంట పండించారని సెంటర్ ఇన్‌చార్జి డీఎస్‌వీ వినాయక్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటి, జాతీయ పోటీలకు అర్హత సాధించారని కొనియాడారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు శ్రీకాకుళంలోని కోడి శ్రీరామమూర్తి స్టేడియంలో అండర్ 17 ఎస్‌జీఎఫ్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో అథ్లెటిక్స్ విభాగంలో డి ఉదయం, జి వెంకట్‌లోకేష్ బి సెలీని, తేజస్విని, సీహెచ్ భార్గవి బంగారు పతకాలు సాధించారన్నారు. ఏ మణికంఠ, ఎస్ పవన్, టి లక్ష్మీహర్ష, పి నిత్యహాసిని సిల్వర్‌తో పాటు బ్రాంజ్‌మెడల్స్ సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈనెల 2, 3, 4 తేదీల్లో తెనాలిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సెంటర్ బాలికలు ఎం పావని, సీహెచ్ కీర్తన 2 బంగారు పతకాలు, సీహెచ్ హారికరెడ్డి 1 సిల్వర్, జి పవిత్ర, కె మేఘన, ఎస్ విహారిక 3 బ్రాంజ్ మెడల్స్ గెలుపొందారని వివరించారు. పోటీల్లో ప్రతిభ చాటిన పావని, కీర్తి మణిపూర్‌లో డిసెంబర్ 2 నుంచి జరిగే జాతీయ పోటీలకు పాల్గొనే అవకాశం దక్కించుకున్నారన్నారు. మొత్తంగా సెంటర్ క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో 7 పతకాలు, వెయిట్ లిఫ్టింగ్‌లో 6 పతకాలు సాధించారన్నారు. విజేతలను కోచ్ ప్రీతిచౌదరి, అసిస్టెంట్ కోచ్ కృష్ణకుమారి, డీఎస్‌డీఓ బి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడేటి చంటి అభినందించారు.

ముగిసిన బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ సెలెక్షన్స్



టేబుల్ టెన్నిస్ సెలెక్షన్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో జరుగుతున్న ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ బాక్సింగ్ మెన్, విమెన్‌లతో పాటు, టేబుల్ టెన్నిస్ మెన్ యూనివర్సిటీ టీం సెలెక్షన్స్ బుధవారం ముగిశాయి. టేబుల్ టెన్నిస్‌కు గాను మహమ్మద్ ఫిరోజ్, దంగేటి నవీన్‌కుమార్, కాపంసెట్టి సురేంద్ర, రాయి రాముడు, నంగాలం అంజనీకుమార్లు ఎంపికవ్వగా, బాక్సింగ్ మహిళల విభాగంలో ఎన రేష్మ, కే లోకేశ్వరి, ఎల్ శిరీష, సీహెచ్ లావణ్య, కే దేవిశ్రీ, సీహెచ్ సాయి, వరలక్ష్మి, బాక్సింగ్ పురుషుల విభాగంలో సీహెచ్ పృథ్వీరాజ్, వీ పవన్, ఎం రవి, సీహెచ్ వెంకట్, బీ మోహన్‌రాజు, సి దినేష్, కే వెంకటసాయిరాం, బి సత్యతేజ రెడ్డి ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు ప్రకటించారు. బాక్సింగ్ విభాగంలో 10 కళాశాలలు, టేబుల్ టెన్నిస్ పోటీలకు ఏడు కళాశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. పరిశీలకులుగా డీఎన్ఆర్ పీడీ డాక్టర్ బీవీ నరసింహరాజు, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఏ సత్యనారాయణ వ్యవహరించారు.

అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం



కైకరంలో పోటీలను ప్రారంభిస్తున్న డీవైఈవో రవీంద్రభారతి

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండులో అండర్ 14 బాలుర, బాలికల అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలను బుధవారం తాడేపల్లిగూడెం డీవైఈవో రవీంద్రభారతి ప్రారంభించారు. హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు, పరిశీలకులు పీవీ ప్రసాదరెడ్డి, ఒలింపిక్ జిల్లా కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి అలివేలు మంగ, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ జగదీశ్వరి పాల్గొన్నారు.

విజేతలు వీరే : హైజంప్ బాలికల విభాగంలో బి.ఇసానా (వైజాగ్), సీహెచ్ భావన (తూర్పుగోదావరి), కె. లక్ష్మీ ప్రియా (చిత్తూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. బాలురు విభాగంలో వి.రాఘవేంద్ర, (విజయనగరం), డి.రహీం (ప్రకాశం), కె.రాఘవేంద్ర, (వైఎస్సార్ కడప), లాంగ్‌జంప్ బాలికల విభాగంలో జి.కొండల లక్ష్మి (తూర్పుగోదావరి), ఎం.రిషిత (కర్నూలు), పి.మానస (శ్రీకాకుళం), బాలుర విభాగంలో ఎం.పెంచల్‌బాబు (వైఎస్సార్, కడప), వి.రాజేష్ (విశాఖ), డి.వెంకట శివప్రకాశం విజయం సాధించారు. షాట్‌పుట్ బాలికల విభాగంలో ఎం.కరిష్మా (గుంటూరు), పి.రితిక (నెల్లూరు), డి.లాస్య (చిత్తూరు), బాలుర విభాగంలో జి చంద్రశేఖర్ నాయుడు (విశాఖ), బి.భరత్‌చంద్ర (శ్రీకాకుళం), వి.గణేష్ (శ్రీకాకుళం) విజయం సాధించారు. డిస్కస్ త్రో బాలుర విభాగంలో జి.చంద్రశేఖర్ నాయుడు (విశాఖ), బి.వెంకటేష్ (కర్నూలు), టి విన్సెంట్ (ప్రకాశం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

వృద్ధులకు అండగా ప్రభుత్వ యంత్రాంగం



వృద్ధులను సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: ఇంటిలోని పెద్దలను భారంగా గాకుండా గౌరవంగా చూడాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధులు వేడుకలో ఆమె మాట్లాడారు. వృద్ధులకు ఎటువంటి సమస్య వచ్చినా ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలుస్తుందన్నారు. మీకోసం కార్యక్రమంలో వృద్ధుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి వృద్ధులు ఒక గొప్ప ఆస్తిగా భావించాలన్నారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మాట్లాడారు. ఈ సందర్భంగా ఒమిక్స్ నెక్స్‌జెన్ లేబోరేటరీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా ఏడీ డి రామ్ కుమార్, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ బోనం పాండురంగారావు, అసోసియేట్ ప్రెసిడెంట్ మట్లపూడి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లపూడి గాంధీ, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ అధికారి దాయన సురేష్ చంద్ర జీ తదితరులు పాల్గొన్నారు.

చెరువు రగడపై చింతమనేని స్పందించాలి



మీడియాతో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

ఏలూరు రూరల్: ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం మొండికోడులో మంగళవారం జరిగిన చేపల చెరువు రగడపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పందించాలని జనసేన నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె ఏలూరు రూరల్ ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజుతో పాటు మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని చేపల చెరువును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అటవీశాఖ మంత్రి అయినందునే కొల్లేరు గ్రామాల్లో చేపల పట్టుబడిపై వివాదాలు నెలకొంటున్నాయనే దుష్ప్రచారం జరుగుతోందన్నారు. దీనిని జనసేనతో పాటు టీడీపీ నాయకులు సైతం ఖండించాలన్నారు. అభయారణ్యం పరిధిలోని చెరువుల్లో చేపల సాగును అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని గుర్తుచేశారు. ఉపాధి లేక గత్యంతరం లేని పరిస్థితిలో కొల్లేరు ప్రజలు కొట్టేసిన చెరువుల్లో చేపలు సాగు చేసుకుని జీవిస్తున్నారని అన్నారు. దీన్ని గుర్తించి అటవీశాఖ అధికారులు మానవతా దృక్పథంతో చేపల పట్టుబడికి సహకరించాలన్నారు. ఈ విషయాన్ని జనసేన అధినాయకత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. వెంకటలక్ష్మి మీడియాతో మాట్లాడుతుండగా తిమ్మారావుగూడెం గ్రామస్తులు వచ్చి అడ్డుకున్నారు. పోలీసులు కల్పించుకుని వారిని గ్రామాలకు పంపించేశారు.

నక్కావారిపాలెంలో చోరీ

పెనుగొండ: సిద్ధాంతం శివారు నక్కావారిపాలెంలో ఓ ఇంట్లో చోరీ జరిగి 25 కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు ఎస్సై కే గంగాధర్ తెలిపారు. సాదా నాగేశ్వరరావు, అతని భార్య మంగళవారం రాత్రి ఇంటిలోని హాల్‌లో నిద్రిస్తుండగా దొంగలు ఇంటి గ్రిల్స్ తొలగించి బెడ్‌రూంలోని బీరువాలో 25 కాసుల బంగారు ఆభరణాలు అపహరించారు. బుధవారం నర్సాపురం సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, పెనుగొండ సీఐ రాయుడు విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

'కోడె నాగు' పట్టివేత



కోడె నాగును పట్టుకున్న చదలవాడ క్రాంతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సుబ్బంపేట రోడ్డులో నివాసం ఉంటున్న ఎల్ఐసీ శ్రీనివాస్ ఇంట్లో ఉన్న ఓపెన్ బాత్రూంలో కోడె నాగు పాము కనిపించింది. బాత్రూమ్‌కు వెళ్లిన శ్రీనివాస్ భార్య ఒక్కసారిగా కంగారుపడి శ్రీనివాస్‌కు తెలియజేయగా ఆయన వెంటనే బాత్రూమ్ డోర్‌ను మూసి వేసి స్నేక్ సేవియర్స్ సొసైటీకి సమాచారం అందించారు. సంస్థ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి పామును సురక్షితంగా పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

క్లుప్తంగా

కార్గో సర్వీస్‌లో జిల్లాలో తాడేపల్లిగూడెం ప్రథమం



కార్గో సర్వీస్ సమావేశంలో జీఎల్‌వీపీ సుబ్బారావు, డిపో మేనేజర్ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్గో సర్వీస్‌లో ఈ సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 7 నెలల కాలానికి రూ. కోటి 32 లక్షలు సాధించి తాడేపల్లిగూడెం పశ్చిమ జిల్లాలోని ప్రథమ స్థానంలో ఉందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్గో అధికారి జీఎల్‌వీపీ సుబ్బారావు వెల్లడించారు. పట్టణంలో కార్గో కార్యాలయంలో జరిగిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ త్వరలో డోర్ పికప్‌ను ప్రారంభిస్తామన్నారు. డోర్ డెలవరీ మరింత విస్తృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ ఏడీఎల్ సుధారాణి, కార్గో డీఎంఈ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆరవల్లిలో ఆలయ అర్చకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అమ్మిరెడ్డి

అత్తిలి: ఆరవల్లి పంచ గ్రామ దేవతలు శ్రీకనకదుర్గమ్మ, మావుళ్లమ్మ, మహంకాళమ్మ, మారెమ్మ, చెవ్వళ్లమ్మ అమ్మవార్లు, పోతురాజు, ద్వారపాలకులు, నాగబంధము, శిఖరాల ప్రతిష్ఠా వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. అమ్మవారి ఆలయప్రాంగణంలో కార్తీక వనసమారాధన జరిపారు. ఆరవల్లి శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ పూజారి కందుకూరి సుబ్రహ్మణ్యంను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉమాసోమేశ్వరస్వామికి లక్షబిల్వార్చన పూజలు



ఆరవల్లిలో ఉమా సోమేశ్వరస్వామికి లక్షబిల్వార్చన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: కార్తీకమాసోత్సవాలు సందర్భంగా ఆరవల్లి గ్రామంలో ఉమా సోమేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, హోమాలు, జ్యోతిర్లింగార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఐలూరి సత్యసాయిశర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు రామేశ్వరపు నాగ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈనెల 17న స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, 27న స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష రుద్రాక్ష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొండ్రుప్రోలులో తాటాకిల్లు దగ్ధం



కొండ్రుప్రోలులో దగ్ధమైన తాటాకిల్లు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించి తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో తాటాకింటిలో అద్దెకు ఉంటున్న జాలపర్తి రాజు కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం అగ్నిమాపక దళాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా, బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు జనసేన నాయకులు నగదు, ఆహారం అందజేశారు. జనసేన నాయకులు మారం వెంకటేశ్వరరావు, పాలూరి వెంకటేశ్వరరావు, రమేష్, యాండ్రపు రాజు పాల్గొన్నారు.

మొగల్తూరులో క్షుద్రపూజల కలకలం

నరసాపురం రూరల్: మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. మొగల్తూరు పంచాయతీ పరిధిలో ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పడమటిపాలెం గ్రామాలకు వెళ్లే ప్రధాన కూడలి రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు నిమ్మకాయలు, కోడిగుడ్డు, మసిబొగ్గు, ఎండుమిర్చి, పసుపు,కుంకుమ, అన్నంముద్దలు రోడ్డుపై వేశారు. మొగల్తూరు జాతీయరహదారిపై గతంలోనూ క్షుద్రపూజలు చేసిన దుండగులు కొంతకాలం తరువాత మళ్లీ పూజలు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమ



న్యూ బ్యాంకు కాలనీలో ఖాళీస్థలాలు ఇలా...



సూర్యాలయం వీధిలోని ఖాళీస్థలాలు

- ఖాళీస్థలాల్లో వృద్ధి చెందుతున్న దోమలు
- రూ. కోట్లు కుమ్మరిస్తున్న నియంత్రణ కరువే
- నామమాత్రంగా పారిశుద్ధ్య చర్యలు

తణుకు: దోమ.. ప్రస్తుతం ఎవరినోట విన్నా దోమల గురించే చర్చ. డెంగీ, మలేరియా జ్వరాలకు ఇవే ప్రధాన కారణమవుతున్నాయి. వీటి నివారణ కోసం ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చిస్తోంది. వీటి బారిన పడి ఆస్పత్రుల్లో జనం రూ. లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. చూసేందుకు ఇది చాలా చిన్నజీవి అయినప్పటికీ మనిషి శరీరంపై ఇది చూపే ప్రభావం అంతా ఇంతాకాదు. ఆదమరిస్తే కొన్నిసార్లు ప్రాణాలను తీసేస్తుంది. ప్రస్తుతం తణుకు పట్టణాన్ని హడలెత్తిస్తున్న జీవి దోమ. ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులకు దోమలే కారణం. పరసరాల శుభ్రత పాటించకపోవడం, చెత్తాచెదారం, బహిరంగ డ్రెయినేజీ వ్యవస్థ, నిల్వ ఉన్న నీరు, ఖాళీ స్థలాలు ఇందుకు కారణం. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రస్తుతం పారిశుద్ధ్యం అటకెక్కింది. పట్టణంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ట్యాంకుల శుభ్రం, క్లోరినేషన్ కార్యక్రమాలను చేపడుతోంది. అయితే ఇవి గ్రామీణ ప్రాంతాల్లో నామమాత్రంగానే సాగుతున్నాయి. ఇక పట్టణాల్లో అయితే సక్రమంగా ఫాగింగ్ చేయడం లేదు.

వ్యాధులకు కారణాలు

డెంగీకి కారణమయ్యే ఈడిస్ ఈజిప్టే దోమ (టైగర్) ప్రస్తుతం ఎక్కువగా ఉంది. నల్లగా ఉండే ఈ దోమ ఒంటిమీద తెల్లని చారలు ఉంటాయి. పగటిపూట మాత్రం కుట్టే ఇది మూతలేని నీటి ట్యాంకులు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీరు, తారు రోడ్లు, సిమెంటుమీద నిల్వ ఉండే వర్షపునీరు, ఇళ్లలోని పూల కుండీలు, కూలర్లు, వాడకుండా వదిలేసిన పాత్రలు, కొబ్బరి చిప్పలు, చీకటిగా ఉండే మూలలు, కర్టెన్లు వంటి వేలాడే వస్తువులు, ఉపయోగించని గొడుగులు, అలంకరణ సామగ్రి కింద ఉంటాయి. కుట్టిన వారం తర్వాత హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కాళ్లు కదిలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకల కండరాల్లో నొప్పి, శరీరంపై పొక్కులు, దద్దుర్లు వస్తాయి. ఇదే సీజన్లో సోకే మరో ప్రమాదకర జబ్బు మలేరియా. ప్లాస్మోడియమ్ పరాన్నజీవి ఆడ అనాఫిలస్ కల్సిఫేసిస్ దోమ ద్వారా ఇది వ్యాపిస్తుంది. మురుగునీటి కాలువలు, చెరువులు, కుంటలు, పంటకాలువలు, పొలాల్లో ఎక్కువగా ఇవి వృద్ధి చెందుతుంటాయి. ఇందులో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం పాల్సిఫారమ్ అనేవి రెండు రకాలు, ప్లాస్మోడియం వైవాక్స్ అంత ప్రమాదకరమైంది కాదు. అయితే రెండో రకమే ఎక్కువగా కనిపిస్తోంది. వెంటనే చికిత్స చేయకుంటే కాలేయం, కిడ్నీలు, రక్తకణాలను దెబ్బతీస్తుంది. ఫైలేరియా క్యూలెక్స్ క్వింకే ఫేసియేటస్ దోమ ద్వారా బోధకాలు (ఫైలేరియాసిస్) వస్తుంది. మురుగు, బురద నీరు గుంతలు, సెప్టిక్ ట్యాంకుల్లో ఇవి వృద్ధి చెందుతాయి. ప్రస్తుతం ఈ కేసులు కనిపిస్తున్నాయి. మెదడువ్యాపు వ్యాధి జపనీస్ ఎన్కెఫలైటీస్‌గా పిలుస్తారు. పందులను కుట్టిన దోమలు తిరిగి మనుషులను కుట్టడం ద్వారా ఇది వ్యాపిస్తుంది. ఇది పిల్లలకు ప్రాణాంతకంగా పరిణమించే అవకాశాలు ఎక్కువ.

దోమల నివారణకు నెల ఖర్చు రూ. 1.50 కోట్లు

దోమల నివారణ కోసం నిత్యం కాయిల్స్, రీఫిల్స్ కోసం నెలకు పెట్టే ఖర్చు రూ. కోట్లకు చేరుతోంది. నలుగురున్న ఓ ఇంట్లో నెలకు నాలుగు రీఫిల్స్, 30 వరకు కాయిల్స్ కొనాల్సిందే. నెలకు ఈ కుటుంబం ఇందు కోసం వెచ్చించే ఖర్చు రూ. 250 అవుతోంది. తణుకు పట్టణంలో 60 వేల కుటుంబాలుండగా ఈ లెక్కన నెలకు దోమల నివారణకు అయ్యే ఖర్చు రూ. 1.50 కోట్లు కావడంతో ప్రజలకు భారంగా మారుతోంది.

దోమ పుట్టుకను నిరోధిస్తే వ్యాధులను నియంత్రించవచ్చు



తణుకులో మురుగునీటి నిల్వలను పరిశీలిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: దోమ పుట్టుకను నిరోధించగలిగితే వ్యాధులనుంచి దూరంగా ఉండవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఏపీహెచ్‌బీ కాలనీ 1వ వార్డులో వెక్టార్ కంట్రోల్ హైజీన్, మస్కిటో లార్వా డెన్సిటీ, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ముఖ్యంగా ఇంటి ఆవరణల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, గృహాల్లో మొక్కల కుండీలు, రుబ్బురోళ్లు, ఫ్రిజ్‌లు, కూలర్‌లలో నీటి నిల్వను వారానికోసారి శుభ్రం చేసుకునే విధంగా కార్యాచరణ చేయాలని సూచించారు. దోమ వదిలిన లార్వా పది రోజుల్లో పిల్ల దోమగా మారుతుందని అందుకని వారానికోసారి డ్రైడేగా పాటించి ఆంటి ఆవరణలో అవసరం లేని నీటి నిల్వలను తొలగింపచేసుకోవాలని కోరారు. ముఖ్యంగా డ్రెయినేజీల్లో చెత్త, వ్యర్థాలు పారవేయరాదని, మురుగునీరు ప్రవాహం జరగకపోతే దోమలు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంటుందని స్పష్టం చేశారు. ముందుగా స్థానికంగా ఉన్న మురుగునీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించి, స్థానికులకు పరిసరాల పరిశుభ్రతపై కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, వార్డు హెల్త్ సెక్రటరీ పి.కమలేశ్వరి, వార్డు ఎన్విరాన్‌మెంట్, శానిటేషన్ సెక్రటరీ ఎం.అనంతలక్ష్మి, ఆశ కార్యకర్త ఎస్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు తణుకు విద్యార్థినుల ఎంపిక



కబడ్డీ పోటీలలో నాల్గవ స్థానం సాధించిన తణుకు మహిళా కళాశాల విద్యార్థినులు

తణుకు టౌన్: ఈనెల 2, 3 తేదీలలో కాకినాడలో జరిగిన ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ కం యూనివర్సిటీ ఎంపిక పోటీలలో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళాకు చెందిన విద్యార్థిని యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరి బాయి తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థినీలు కబడ్డీ పోటీలలో నాల్గవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈపోటీలలో తమ కళాశాల విద్యార్థినీ బీ హారిక యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన కబడ్డీ జట్టు యూనివర్సిటీ తరపున ఈనెల 26 నుంచి 30 వరకూ అలగప్పా యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ మహిళల కబడ్డీ పోటీలలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ తరపున పాల్గొంటారని తెలిపారు. సౌత్ జోన్ మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినీలను, పీడీ ఎం రత్నకుమారిలను కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట సుబ్బారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరిబాయి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం



అమరవీరుల సంస్మరణ సభ ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మామిడి దానవర ప్రసాద్ పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ సభ, ప్రదర్శనలో భాగంగా బుధవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో దానవర ప్రసాద్ మాట్లాడుతూ అమరవీరులు తమ జీవితాలను సమాజంలో మార్పు కోసం, నూతన సమాజం కోసం త్యాగాలు చేశారని తెలిపారు. అమర వీరుల కన్నకలలను నిజం చేయాలన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు బలమైన ఉద్యమాలను నిర్వహించి, మన హక్కులను కాపాడుకుందామన్నారు. కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను కేంద్రంలో ఉన్న మోదీ, అమిత్ షా ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ గాలికి వదలివేశారని చెప్పారు. ఉచిత ఇసుక అమలు కావడం లేదని, విద్యుత్ చార్జీలు విద్యుత్ సర్దుబాటు పేరుతో భారీగా చార్జీలు పెంచడం చేస్తున్నారని, నిలుపుదల చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు అమలు కాలేదని, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, తల్లికి వందనం, ఫీజు రియంబర్స్‌మెంట్, చేయూత, ఇతర పథకాలు లేవన్నారు. నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. అన్ని సమస్యలను పరిష్కరించాలని కోరారు. సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌కుమార్, అశ్విన్ భాష, రాము, శ్రీను, వెంకటపతి రాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ మాఫియాను అరికట్టాలి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ, పరిసర గ్రామాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భూములపై రియల్ ఎస్టేట్ మాఫియాను అరికట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలో ఆర్డీఓ కతీబ్ కౌసర్ భానోకు బుధవారం లక్ష్మణరావుతో పాటు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నల్లమిల్లి ఫణి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆయా సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాలకుల అండదండలతో అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడవటం, ప్రభుత్వ భూములను కబ్జా చేయడం వంటి వాటిని అరికట్టాలని కోరారు.

నాన్ రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు నిర్వహించాలి

తణుకు అర్బన్: ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను ఆయా జిల్లాల్లోని ముఖ్య పట్టణ కేంద్రాల్లో నాన్‌రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని స్కూల్ ఫెడరేషన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ జాకబ్‌బాబు డిమాండ్ చేశారు. స్కూల్ ఫెడరేషన్ గతంలోనే ఈ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చినా విద్యాశాఖ అధికారులు పెడచెవిన పెట్టిన కారణంగా ఒక నిండు ప్రాణం బలైపోయిందని విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రు జిలా పరిషత్ హైస్కూలు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు తోట రత్నకుమార్ ఏలూరు జిల్లాలోని ఆగిరిపల్లి హిల్ స్కూలులో లీడర్‌షిప్ శిక్షణకు వెళ్లి గుండెపోటుతో మరణించారని వివరించారు. శిక్షణ తరగతులు దూరప్రాంతాల్లో కాకుండా ఏ జిల్లాకు ఆ జిల్లాలో నిర్వహించాల్సిందిగా కోరుతున్నామని చెప్పారు.

హెచ్‌ఎంలకు శిక్షణతో ఒత్తిడి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉండి మండలం ఉణుదుర్రు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు(ఎఫ్ఏసీ) టీవీ రత్నకుమార్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడంతో ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ ఉన్నతాధికారుల తీరుపై మండిపడుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ప్రధానోపాధ్యాయులు మృతి చెందాడని వారు ఆరోపిస్తున్నారు. ఓ పక్క తీవ్ర ఒత్తిడి పెడుతూ మరోవైపు శిక్షణా కార్యక్రమాలు అంటూ దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణలు మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యమేనని అన్నారు. వయసుపైబడిన ప్రధానోపాధ్యాయులకు శిక్షణ అంటే కనీస వసతులు ఉండాలని, కానీ కనీస సదుపాయాలులేని ఓ మారుమూల ప్రాంతంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి ప్రధానోపాధ్యాయుడి మరణానికి కారణమయ్యారని అన్నారు. సౌకర్యాలు లేని చోట్ల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించడం వల్లే ప్రధానోపాధ్యాయుడు మృతి చెందాడని మండిపడ్డారు. గతంలో ఎన్నో అనుభవాల దృష్ట్యా ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను నిలిపివేయాలని అనారోగ్యకారణాలతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఉన్నతాధికారులకు వినతిపత్రా లు ఇచ్చినా పట్టించుకోవడం లేదంటూ వాపోయారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి

పెనుగొండ: మహిళలు ఆర్థికంగా బలపడిన నాడు కుటుంబంతో పాటు, దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని కరూర్ వైశ్యాబ్యాంక్ తణుకు బ్రాంచి మేనేజరు వీఎస్ చైతన్య అన్నారు. మై పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కరూర్ వైశ్యా బ్యాంక్ ఆర్థిక సౌజన్యంతో ఆరు నెలలు పాటు శిక్షణ పొందిన 100 మహిళలకు పెనుగొండలో కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు.

వీఏవోల సమస్యలు పరిష్కరించాలి



తణుకు మండల సమాఖ్య ఏపీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీఎంలు

తణుకు: ఏపీ వెలుగు వీఏవోల (యానిమేటర్లు) మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని బకాయి వేతనాలు చెల్లించాలని వీఏవోల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం తణుకు మండల సమాఖ్య కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వీఏవోల ఉపాధి దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో 28 వేల మంది వీఏవోలు పొదుపు సంఘాల మహిళలకు సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్నారని అయితే వీరి కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. గతంలో అక్రమంగా తొలగించిన వీఏవోలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.భాగ్యలక్ష్మి, ఎ.పార్వతి, పి.దీప్తి, ముంతాజ్‌బేగం, పి.మహాలక్ష్మి, డి.దేవి, కె.రత్నకుమారి, కె.వెంకటరమణ, జి.బేబీరాణి, పి.మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



ఆకుతీగపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం దృశ్యం

పెంటపాడు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై సరైన అవగాహన పెంచుకొని ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో అధికలాభాలు ఆర్జించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై. నూకరాజు పేర్కొన్నారు. గురువారం ఆకుతీగపాడు సెంటర్‌లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు, సభ్యులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ లింగాకర్ష బుట్టలు, ఎల్లో ప్లేట్, బయో కల్చర్, అజోల్లా తదితర విషయాలపై అవగాహన కల్పించడంతో పాటు, తెగుళ్ల సోకకుండా రైతులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి, జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి, గూడెం, పెంటపాడు ఇన్‌చార్జిలు రత్నాజీ, వీర్రాజు, సుబ్బారావు, నాగకృష్ణ రైతులు, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బందితో పాటు, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల విధానం రద్దు చేయాలి

పెనుగొండ: పంచాయతీల్లో టెండర్ విధానం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయుడు డిమాండ్ చేశారు. బుధవారం పెనుగొండ పంచాయతీ వద్ద కార్మికులతో మాట్లాడారు. రాష్ట్రంలో టెండర్ విధానంలో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం అక్రమార్కులపై చర్యలుతీసుకోవాలన్నారు. కార్మికులను కార్మికులుగా గుర్తించి వారికి పీఎఫ్ అమలు చేయాలని కోరారు.

ప్రతి ఇంటికీ రీసర్వే ద్వారా పాస్‌బుక్



కోలమూరు గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారి జాషువా

ఉండి: రీసర్వే పూర్తి కాగానే ప్రతి ఇంటికీ పాస్‌బుక్ జారీ చేస్తామని జిల్లా సర్వే అధికారి కె.జాషువా అన్నారు. బుధవారం ఉండి మండలం కోలమూరులో సర్పంచ్ నడింపల్లి సత్యవతిరామకృష్ణంరాజు అధ్యక్షతన రీసర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రీసర్వే పారదర్శకంగా నిర్వహించి ప్రతి ఒక్కరికీ వారికి సంబంధించిన పత్రాలు అందిస్తామన్నారు. అలాగే ఇంటింటికీ కూడా పాస్‌బుక్‌లు అందిస్తామని వాటిని బ్యాంకు లోన్లు తీసుకునేందుకు కూడా వాడుకోవచ్చునని తెలిపారు. పొలాల విషయానికి వస్తే ప్రతితీ కొలతలోనూ సుమారుగా 5 సెంట్ల వరకు వ్యత్యాసం ఉండే అవకాశం ఉందన్నారు. సాంకేతిక పరి జ్ఞానం పెరిగిందని శాటిలైట్స్, రోవర్స్ సహాయంతోనూ రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ భూములు(కాలువలు,రోడ్లు) కలుపుకుని 463.47 ఎకరాల ఉందన్నారు. గ్రామంలో పూర్తి స్థాయిలో విధులు నిర్వర్తించేందుకు సర్వేయర్ ఉండాలని గ్రామస్థులు కోరడంతో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సర్వేయర్‌ను నియమించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడో?

- ఇసుక లభ్యం కాక నిలిచిన నిర్మాణాలు
- పనులు లేక లబోదిబోమంటున్న కార్మికులు
- ఇసుక వెతుకులాటలో నిర్మాణదారులు



తాడేపల్లిగూడెంలో ఇసుక అందుబాటులోకి రాక మధ్యలో నిలిచిన భవనాలు

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ఆర్భాటంగా తీసుకొచ్చింది. అయితే అనుకున్న రీతిగా ఇంటి నిర్మాణదారులకు ఇసుక లభ్యం కాక ఇంటి నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇసుక బ్లాక్ మార్కెట్ అవుతుందని పలువురు నిర్మాణదారులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఐదు టన్నులు ఇసుక రూ.18 వేల నుంచి 25వేలకు విక్రయిస్తున్నారు. సాధారణ, మధ్య తరగతి గృహ నిర్మాణదారులు ఇంత పెద్ద మొత్తం వెచ్చించి ఇసుక కొనుగోలు చేయలేక నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే మరో పక్క ఇంటి నిర్మాణాలు ముందుకు సాగక ఈ రంగంపై ఆధారపడిన కార్మికులు లబోదిబోమంటున్నారు. పూట గడవటమే కష్టంగా మారుతుందని వాపోతున్నారు. అలాగే నిర్మాణరంగంపై ఆధారపడిన అనుబంధ రంగాల వారి పరిస్థితి ఇదే మాదిరిగా ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఇసుక అందుబాటులోకి వస్తుందని అధికారులు చెప్పిన మాటలు సైతం నీటి మీద రాతల్లా మారాయని నిర్మాణదారులు వాపోతున్నారు. మరో పక్క ఇసుక బుకింగ్‌కు సంబంధించి ఆన్‌లైన్ సైట్లు సైతం తెరుచుకోవడం లేదని గగ్గోలు పెడుతున్నారు.

పనులు లేక అప్పుల పాలు



ఇసుక పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. దీంతో పనులు లేక పూటగడవని పరిస్థితి. అప్పుల వారికి సమాధానం చెప్పలేని పరిస్థితి. తీసుకున్న అప్పులను తిరిగేస్తే ప్రస్తుత పరిస్థితుల్లో కట్టగలమా ? అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుకను అందుబాటులోకి తేవాలి. – జి.విక్టర్, సెంటరింగ్ కార్మికుడు, తాడేపల్లిగూడెం

ఎన్నికల నాటి నుంచి అరకొర పనులే!



సాధారణ ఎన్నికల కోడ్ నుంచి భవన నిర్మాణరంగంలో అరకొర పనులు మాత్రమే లభిస్తున్నాయి. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం ఆన్‌లైన్ బుకింగ్‌ను గాడిలో పెట్టకపోవడంతో నేటికీ చేతి నిండా పని లేని పరిస్థితి. సైట్ చేర్పులు, మార్పుల పేరుతో కాలం వెళ్ళదీస్తోంది. నిర్మాణరంగం మనుగడను కాపాడాలి. – జెట్టి శివ, తాపీ మేస్త్రీ, తాడేపల్లిగూడెం